
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!
గురుకృప
సద్గురు లీలా వినోదము
విజయదశమి సంచిక
గురోవినతీమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ రసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!

# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ధతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీ బాబూజీ

## అనుభవ ~ ప్రాప్తి స్థానాలు


1. సాయివంటి దైవంబు లేడోయి..లేడోయి... శ్రీ బాబూజీ .................... 2
2. ఉన్నమాట - అనుకున్నమాట గురుబంధువులు .................. 3
3. అభయం రాజా, ముంబయ్ .................. 6
4. సాలోచన రమాలక్ష్మి, ASK .................. 7
5. గురుసన్నిధి రామకృష్ణ, చెన్నై .................. 8
6. శిక్షణ అనిల్, హైదరాబాద్ .................. 9
7. అనుగ్రహం సంధ్య, సంతనూతలపాడు .................. 11
8. ఎరుక-మరపు మురళీధర్, విజయవాడ .................. 13
9. రసస్పందన గురుకృప .................. 15






సంపుటి : 10
సంచిక : 4

త్రైమాసిక పత్రిక
అక్టోబర్ 2007

నిర్వహణ

గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

చిరునామా

గురుకృప
2-1-6,
గాంధీచౌక్,
తెనాలి-01

ఫోన్:

08644-227194

ముద్రణ

రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం

ఫోన్స్ :
2798072
2740222

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్న మాట

సద్గురురాయా! కుండపోతగా వర్షించిన మీ అనుగ్రహధారలలో తడిసిముద్దయిన గురుబంధువులు గురుపూర్ణిమ మధురానుభూతుల నుంచి తేరుకోవడానికి ఇష్టపడడం లేదు. సద్గురు మాయి దీవెనలతో, స్పర్శ, భాషణలతో, కమనీయమైన దర్శన భాగ్యంతో తనువంతా పులకరించి, అనుక్షణాన్ని ఆస్వాదించారు, జరిగిన గురుపూర్ణిమ సద్గురు చరణ దాసులకు నిజంగా నిండు పున్నమే! సాధారణంగా గురుపూర్ణిమ ఒక్కరోజు మాత్రమే జరుగుతుంది. విశేషం– ఈ సారి నాలుగురోజులు. వరుసగా సద్గురుచంద్రుని దర్శనం నాలుగురోజులు. ఆహా! అందుకున్న వారికి దండుకున్నంత! ఎన్నో వత్సరాల తరువాత ఒక అనుగ్రహ వెల్లువ. వేలాది గురుబంధువులు– ఒక ప్రక్క కళ్యాణ వేడుకలు, మరో ప్రక్క అన్నప్రాసన, అక్షరాభ్యాసాల ఆనంద సందోహాలు – మరుసటిరోజు సద్గురు అనుగ్రహ వర్షంలో తడిసి ముద్దవుతూనే ప్రతి పదమూ సాయిపథమేనంటూ సాగిన పల్లకీ ఉత్సవపు పదనిసలు – వరుణుని రూపంలో కరుణ కురిపించి మదిలోని భావాలకు శ్రీ బాబూజీ స్పందించి మరొక్కరోజు రెండు సార్లు సాయినామంలో అందరితో పాల్గొన్న మధురక్షణాలు, పూజ్యశ్రీ బాబూజీ పూజా (హృదయ) మందిరంలో ఆసీనులైన 'శ్రీసాయి' తో అడుగులో అడుగులేస్తూ శ్రీ బాబూజీ ఊసులో, ధ్యాసలో, ప్రేమనిండిన శిరిడీ క్షేత్రపు అణువణువు ఆస్వాదిస్తూ సాగిన గురుబంధువుల సమాహారాలు – ఎక్కడ చూసినా సంబరం! ఎక్కడ విన్నా అంబరాన్నంటే సాయినామ సంరంభం! అందరిదీ ఒకే పిలుపు, "సాయిబాబా... సాయిబాబా..." ప్రతీ ఒక్కరిదీ ఒకే బాట–సాయిపథం. **ఈ గురుపూర్ణిమ మహోత్సవాలు సద్గురు ప్రేమైక ప్రపంచపు ఆనవాళ్లు.**



## సద్గురువు పట్ల మనకున్న ప్రేమను వ్యక్తం చేసే ప్రతీ పని పూజే



గురుదేవుల కృపా విశేషమేమంటే ఈ పరి గురుదేవుల దర్శనభాగ్యంతోపాటు – ఆ చల్లని చూపుల మందహాసాన్ని వీక్షిస్తూ, వారి అనుగ్రహ జలధిలో తరిస్తున్న గురు బంధువుల మోములను కూడా వీక్షించే భాగ్యం. 'నీపాద సేవయు... నీ పాదార్చకుల తోడి నెయ్యము...' అంటూ కీర్తించిన పోతన పద్యపు మాధుర్యపు రుచి, కమ్మదనం గురుబంధువుల వీక్షణాల్లో గాంచి సద్గురు మహత్మ్యాన్ని మరొక్కసారి దర్శించుకునే భాగ్యం. ప్రతి గురుబంధువు వదనంలోనూ ఒక వింతైన అనుభూతి. తన కష్ట, సుఖాలనన్నింటిని చెప్పుకొని తన బాధ్యతంతా అప్పచెప్పే ఒక బిడ్డ, తన ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్య శాస్త్రం ఏమీ చేయలేదంటూ, సద్గురు అనుగ్రహ శాస్త్రమే తనకు రక్ష అంటూ వేడుకునే ఒక యువతి, " మీ దరహాసమే చాలు నాకు వేయి జన్మలైనా అన్నట్లు..." అవ్యక్తమైన అనుభూతిలో మరో యువకుడు. "మూర్తీభవించిన జ్ఞానం భువిపై సాక్షాత్కరించింది. ఇదే మంచి సమయం. ఆలసించక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండంటూ" మరో గురుబంధువు ఆలోచన, "సద్గురువు పట్ల మనకున్న ప్రేమను వ్యక్తం చేసే ప్రతీ పని పూజే" కనుక తన సృజనాత్మకతకు, శారీరక శ్రమను జోడించి, గురుదేవుల దర్శన భాగ్యాన్ని మరింత శోభాయమానంగా మలచే ఇంకో గురుబంధువు, "సాయిపథ సారధి, సాయి సాహితీ వారధి – శ్రీ బాబూజీ, సాయి గురించి వింటే వారి నోట వినాలి – చదివితే వారి సాహిత్యం చదవాలి". ఇంకా ఇంకా వారి సాహిత్యం చదవాలన్న కుతూహలం ఒక గురుబంధువుది. ..... ఇలా..... ఇలా......

ఎందరో గురుబంధువులు... ఎన్నో భావాలు.... వ్యక్తం చేసే అనుభూతులు కొన్ని.. అవ్యక్తంగా మరెన్నో! అంతులేదు, అలసట రాదు, ఎన్ని విన్నా! ఎంత చూసినా! ఈ భావాలన్నిటికి ఒక్కటే మూలం. ఒక్కటే గమ్యం – ఒక్కటే మార్గం – అది పూజ్య శ్రీ బాబూజీ. ఏమిటి ఈ సన్నిధిలోని మహత్తు! ఏం పొందుదామని ప్రతీ మనిషి తపించిపోతున్నాడు. ఈ విశేషాలలోని బోధలేమి? ఒక చిన్న సంభాషణతో మర్మాన్ని మనమందరం తెలుసుకుందాం. ఒక మారుమూల పల్లె నుంచి ఒక కుర్రాడు గురుదేవుల దర్శనానికి తరచుగా వస్తూ ఉన్నాడు. వచ్చిన ప్రతీసారి తన కష్టాలు, సుఖాలు అన్నీ చెప్పి కోర్కెలు తీర్చమని వేడుకొని చల్లని దీవెనలతో సాగిపోతున్నాడు. ఈసారి గురుదేవులతో మాట్లాడాలని, వారు తనను చూసి దీవించాలని, తపించాడు ఆ కుర్రాడు. అందరితో కలసి వరుసలో నిలబడి శ్రీ బాబూజీ ఆగమనానికై వేచి చూసాడు. గురుదేవులు తన వద్దకూ వచ్చారు, వెళ్లారు. అయితే తనను చూసారా! చూడలేదా! దీవించారా! లేదా! సంశయం. వెనువెంటనే ఏదో ఒక తెలియని నిశ్శబ్దం. అప్పటి వరకు ఉన్న సంతోషం స్థానే ఏదో ఒక వెలితి, శూన్యం. ఆ బాధను వ్యక్తం చేయడం... సరి, కుదరదు. ఇదంతా జరుగుతున్న ఆ సందర్భంలోనే అతను ఒక చిన్న విషయం గమనించాడు. రెండు దశాబ్దాలుగా గురుదేవుల అనుగ్రహాన్ని ఆస్వాదిస్తున్న ఒక





గురుబంధువు–గురుదేవుల పాదస్పర్శకై పడ్డ తపన, గురుదేవుల పట్ల ఆ గురుబంధువుకు ఉన్న నిబద్ధత కంటిచూపును మరల్చుకోలేకపోయాయి.

గురుదేవులు తనవంక చూడలేదన్న సంశయుడైన ఆ కుర్రాడు ఆ గురుబంధువుకు రెండు రోజుల తరువాత ఫోన్ చేసి అడిగాడు. “సార్! నా విషయంలో ఇలా జరిగింది. రెండు రోజుల నుంచి నాకు చాలా బాధగా ఉంది. ఏదో ఒక తెలియని అలజడి. గురువుగారు నాపట్ల ఎందుకిలా ఉన్నారంటూ” కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు. ఓపిగ్గా అంతా విన్న ఆ గురుబంధువు ఇలా అన్నారు.“ఓహో! అయితే ఈ రెండు రోజులు నువ్వు ఏం చేసావు? గమనించావా? గురుస్మరణ చేస్తూ ఉన్నావు. నీ వేదనంతా ఎందుగురించి? ఆయన దర్శనం కోసమే కదా! ఇలా నీకు చక్కటి అవకాశాన్నిచ్చారు గురుదేవులు. సరే! అసలు విషయం విను. నేను వారితో గడిపిన ఇన్ని సంవత్సరాలలో ఆయన ఎవ్వరినైనా చూడలేదన్న సందర్భాన్ని నేను ఎరుగను. నువ్వు చూసే ఆ రెండు కళ్లతోనే ఆయన చూస్తున్నారనుకుంటే అది పొరపాటు. సద్గురువుకు అనంతకోటి చక్షువులు. ఆయన ఏ విధంగా, ఏ సమయంలో చూసారో మనం ఊహించలేం”. సమాధాన పడని ఆ కుర్రాడు ఇక ఆ గురుబంధువును వ్యక్తిగతంగా ఇలా అడిగాడు. “సరే! మిమ్మల్ని కూడా చూసారో, లేదో! కానీ ఇంత వయసులో కూడా మీకెందుకు ఇంత తపన– ఏమిటి మీరు ఆశించేది” అంటూ వాపోయాడు. ఇక అప్పుడు అసలు విషయం బయటకు వచ్చింది. “ఒక్కటే విషయంరా! నేను నా జీవితకాలంలో ‘ఒక మనిషిని ప్రేమించడం’ అంటే ఎట్లా ఉంటుందో గురువుగారి దగ్గరే చూసాను. ప్రేమించడం అంటే ఏమిటో ఆయనకే తెలుసు. ఈ ప్రపంచంలో నాకు తెలిసినంతలో ప్రేమించడం చేతనయితే అది గురువుగారికే! ఇది సత్యం. ఇక నాకు సందేహమేముంది? ఆయన ప్రేమను పొందేందుకు నాకు ఏదీ అడ్డంకి కాదు. మనలను ప్రేమించే వ్యక్తి ఒకరంటూ ఉంటే అది పూజ్య గురుదేవులు మాత్రమే”. కనువిప్పంటారా! కలకాలం కాచే సద్గురుమాయి అందించిన కమ్మని అనుభూతి అంటారా! ఏమన్నా సరే ఇది సత్యం. సద్గురువుకన్నా ప్రేమించే వ్యక్తి ఈ భువిపై లేడు. “సద్గురు దేవా! అవగతమవుతోంది, సత్సంగ మహిమ – గురు బంధుత్వంలోని పరిణతి”.

సమాధాన పరుస్తారని ప్రశ్నిస్తే – సత్యాన్ని ఎరుకపరిచారంటూ ఆ కుర్రాడు పరవశించిపోయాడు. ఇంతకీ అసలు విషయం ఏమంటే “ఈ జగాన ప్రేమించే జీవి లేరని బాధపడకు. జగమంతా సద్గురు మయం – సాగేను సద్గురు సంకల్పం – చిత్తమున దాగే గురు స్వరూపం – కనుగొంటివా సర్వమూ సంతోష దాయకం”.

**–గురుకృప**



**ఎవరైతే తమ భారం నాపై మోపి, నా గురించే చింతన చేస్తారో, వారి సర్వ బాధ్యతలను నేనే వహిస్తాను.**



ప్రియమైన అందరికీ, నా పేరు రాజా. మాది తెనాలి. నాకు గురూజీ గురించి తెనాలిలో తెలుసు. కానీ ఎప్పుడూ సత్సంగాలకు వెళ్లడం జరగలేదు. నేను మార్కెటింగ్ ఉద్యోగాలను చేస్తూ అక్కడా, ఇక్కడా తిరుగుతూ చివరకు వైజాగ్ చేరాను. నాకు డిగ్రీలో పరిచయమున్న శ్రీను ఇక్కడ ఉండడంతో అతని రూమ్‌లో ఉన్నాను. గురువుగారు అతన్ని మిషగా చేసుకొని నన్ను బాబా దగ్గరకు చేర్చారు. ఒక సంవత్సరం మార్కెటింగ్ ఉద్యోగం తరువాత, వేరే ఉద్యోగంలోకి మారదామని హైదరాబాద్ వచ్చాను. బాబాకు చెప్పుకున్నా, నాకు మంచి అవకాశమిమ్మని! ఒక కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి, సబ్జెక్ట్ నేర్చుకొని బయటకు వచ్చి ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నించాను.

ఒక సంవత్సరం పాటు అక్కడా, ఇక్కడా ఉద్యోగం కోసం ప్రయత్నించాను. ఒక ఆరు నెలలు ఈ దేశం, ఆ దేశం అంటూ సమయం, డబ్బు వృధా చేసాను. ఎటువంటి ఫలితమూ లేదు. నాకు బాబా మందిరమంటే కేవలం గురువారం నాడు అన్నట్లు ఉండేది. (నాకున్న కష్టసుఖాలు బాబాకు చెప్పుకునేందుకు నేను ఇప్పుడు రెగ్యులర్‌గా వెళుతున్నాను) కానీ, ఎప్పుడూ ప్రత్యేకంగా బాబాకు ఏమీ చెప్పుకోలేదు. ఒకరోజున నేను ఒక స్నేహితుని ఇంటికి వెళ్లినపుడు నాకు కృష్ణ అనే అతను పరిచయమయి వాళ్లింటికి నన్ను తీసుకుని వెళ్లాడు. అక్కడకు వెళ్లేసరికి వాళ్ల హాలులో బాబా, గురువుగార్ల చిత్రపటాలు ఉన్నాయి. ఇక అతనితో పరిచయమయ్యింది. ఇదిలా ఉంటే నాకు నాంపల్లిలో సత్సంగం జరుగుతుందని తెలుసు. కొన్నిసార్లు వెళ్దామని ప్రయత్నించినా వెళ్లడం జరగలేదు. ఒకరోజు ఉన్నట్లుండి కృష్ణ నాంపల్లి సత్సంగానికి వెళ్దామని అడగడం, వెంటనే అక్కడకు వెళ్లడం జరిగాయి. అక్కడ జరుగుతున్న సాయినామాన్ని నేను చక్కగా ఆనందించాను. గురుబంధువులు వారివారి అనుభవాలను పంచుకుంటున్నారు. నేను జరుగుతున్నదంతా చూస్తూ ఉన్నాను. ఆ తరువాత వారం మళ్లీ వెళ్దామనుకున్నా మూడవ వారానికి మళ్లీ వెళ్లాను. సుబ్బరాజాగారనే గురుబంధువు తన అనుభవాన్ని పంచుకుంటున్నారు. నేను సాధారణంగా చిన్న చిన్న సంఘటనలకు క్రుంగిపోయే వాడిని కాను. ఏదో ఒక తెలియని బాధ నన్ను ఇబ్బంది పెట్టింది. కన్నీళ్లతో బాబా, గురుదేవులను వేడుకున్నాను. నాకు ఉద్యోగమిప్పించమని. ఇప్పుడు వేడినట్లు నేను ఎప్పుడూ వేడుకోలేదు.

తరువాత వారం నాకు ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. రెండోవారం రెండో రౌండ్ ఇంటర్వ్యూ, మూడోవారం వీడియో కాన్ఫరెన్స్, ఆ తరువాత రోజు పిలుపు వచ్చింది. ముంబాయిలో ఉద్యోగం–వచ్చి





జాయిన్ అవ్వమని. గురువుగారికి, బాబాకు నమస్కరించుకున్నాను. మా అమ్మ బాబా చరిత్ర చదువుతూ 24 గం॥లు నా గురించే ఆలోచిస్తూ ఉంటుంది. నాకు ఒకటే ధైర్యం. ఈ ఉద్యోగం బాబా ఇచ్చింది కనుక ఆయన అన్నీ చూసుకుంటారని. ఆయన ఇచ్చింది కనుక నేను కూడా వంద శాతం శ్రద్ధతో చేస్తున్నాను. ఎంత ఇబ్బంది వచ్చినా మనసులో ఒకటే ధైర్యం. నాకు బాబా, గురువుగారు ఉన్నారని, ఇంతకు ముందు ప్రతి విషయానికి ఏదో టెన్షన్. నేను గురుపూర్ణిమకు గురువుగారి దర్శనం చేసుకున్న తరువాత, నరేంద్రగారితో ఈ విషయాన్ని చెప్పి, గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపుకుందామనుకున్నా – ధైర్యం చాలలేదు. 'గురుకృప' నాకిచ్చిన అవకాశం ద్వారా గురువుగారికి నా కృతజ్ఞతాపూర్వక నమస్సులు. **–రాజా, ముంబయ్**

* * *

పూజ్య గురుదేవుల పాద పద్మములకు నమస్కారం తెలుపుకుంటూ నా అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. నేను జనవరి 2004 లో నా వివాహం తరువాత యు.ఎస్.కి వెళ్లడం జరిగింది. వెళ్లిన మరుసటి రోజు, పొరుగువారైన నార్త్ ఇండియన్స్ ఇంటికి భోజనానికి వెళ్లాము. అలవాటుగా అక్కడ బాబా ఫోటో ఉన్నదా అని చూసాను. అక్కడ ఏమీ కనిపించలేదు. వాళ్లు ఎవ్వరూ కూడా బాబా భక్తులు కాదు. మేము ఇంటికి తిరిగి వస్తుంటే అక్కడకు వచ్చిన తెలిసినవారు ఒక గిఫ్ట్ మాకు ఇచ్చారు. మేము గిఫ్ట్ ఏమీ వద్దు అంటే రమాకి ఇస్తున్నాము అని ఇచ్చారు. నేను ఇంటికి వచ్చి నిరాశగా ఇక్కడ బాబా భక్తులు ఎవ్వరూ లేరు. బాబాకి, గురువుగారికి దూరం కాకూడదు అని గురువుగారికి ఇ–మెయిల్ ఇచ్చాను. తరువాత కొంతసేపటికి ఆ గిఫ్ట్ ఏమిటని చూస్తే బాబా ఫోటో ఉన్న క్లాత్ ఉన్నది. అలా బాబా మా ఇంటికి వచ్చారు. చాలా ఆనందం వేసింది. బాబా అన్న మాటలు "నీవు ఎప్పుడు, ఎక్కడ ఉన్నా తలచినంతనే నీ చెంత ఉంటాను" గుర్తుకు వచ్చాయి. నేను EAD మీద యుఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. EAD ని ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకోవాలి. నేను మార్చి 2005లో ఒక కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్లేముందు నా EAD చూసుకుంటే అది ఏప్రిల్ 28, 2005కు గడువు పూర్తికానున్నది. మామూలుగా గడువు పూర్తి అవడానికి 90 రోజుల ముందు రెన్యువల్‌కి పంపించాలి. నేను దాని విషయం పూర్తిగా మర్చిపోయాను. గురువుగారి దయవలన ఆ కంపెనీలో శ్రమ లేకుండా జాబ్ వచ్చింది. ఒక సంవత్సరం క్రితం మొదటిసారి ఆ కంపెనీ గురించి తెలుసుకున్నపుడు దానిలో జాబ్ చేయాలి అని అనుకున్నాను. దాని విషయం మర్చిపోయాను. గురువుగారు నా కోరిక అలా తీర్చారు అనుకున్నాను.



ఏప్రిల్ 4, 2005న జాబ్‌లో జాయిన్ అయ్యాను. EAD గడువు అయ్యేలోపు అంటే ఏప్రిల్ 28, 2005 లోపు నా క్రొత్త EAD రావాలి. లేకపోతే నాకు పనిచేయడానికి అర్హత ఉండదు. గురువుగారు ఎలా పరిష్కరిస్తారో చూద్దాం అని ఎదురుచూస్తున్నాను. ఏప్రిల్ 20 వచ్చేసింది. 28 లోపు EAD రాకపోతే నన్ను ఉద్యోగం నుంచి తొలగించవలసి వస్తుంది అని కంపెనీ నుంచి ఇ-మెయిల్ వచ్చింది. రోజూ అప్లికేషన్ స్టేటస్ చెక్ చేస్తున్నాను. ఏప్రిల్ 25 రాత్రి వరకు రాలేదు. గురువుగారికి ఇ-మెయిల్ పంపించే ముందు ఇంకొక్కసారి అప్లికేషన్ స్టేటస్ చెక్ చేస్తే EAD జారీ అయినట్టుగా ఉంది. చాలా సంతోషం అనిపించింది. ఆఫీస్‌లో చెప్తే అప్రూవ్ అయితే సరిపోదు. మాకు కార్డు చూపించాలి అని చెప్పారు. కార్డ్ రెడీ అయ్యి, వాళ్లు పోస్ట్ చేసి నాకు చేరేటప్పటికి ఎన్ని రోజులు పడుతుందోనని అనుకున్నాను. కానీ, ఇంత చేసిన గురువుగారు ఇది చేస్తారు అనే నమ్మకం. ఏప్రిల్ 28 వరకు నా EAD చేతికి అందలేదు. ఏప్రిల్ 29నుంచి ఆఫీస్‌కి వెళ్లకూడదు. ఆశ్చర్యం! ఏప్రిల్ 29నే నాకు కొత్త EAD చేతికి వచ్చింది. నేను వెంటనే కంపెనీ వాళ్లకు అందచేసాను. పేపర్ వర్క్ అంతా పూర్తి చేసాను. ఈ విధంగా గురువుగారు సరైన సమయానికి కావలసినవి అందించారు. బాబా మరియు గురువుగారు చివరి క్షణం వరకు ఉత్కంఠ రేపి, ఎంతో ఆనందాన్ని అందించినారు. గురువుగారు చూపిన మార్గంలో నడుస్తూ ముందుకు సాగాలి అని బాబా, గురువుగారిని ప్రార్థిస్తూ...

**– రమాలక్ష్మి, ASK**

* * *

నా పేరు రామకృష్ణ. నేను చెన్నై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా వర్క్ చేస్తున్నాను. నాకు మొదటి నుంచి ఒక గురువుగారి మార్గదర్శకత్వం కావాలని ఉండేది. గురువు అనే పదానికి అప్పట్లో నాకు తెలిసిన అర్థం బాగా "ఆసనాలు మరియు మెడిటేషన్ నేర్పించేవారు" అని. అదేవిధంగా కొంతమంది గురువుల దగ్గరకు కూడా తిరిగాను. నా డిగ్రీ పూర్తి అయిన తరువాత 1996లో మొదటిసారి గురువుగారి దగ్గరకు వచ్చాను. అప్పుడు నేనున్న 28 రోజులు నాకు (అంటే ఈ జన్మకు సరిపడా) మంచి గురువు దొరికారు అనే అభిప్రాయం కలిగింది. గురువు అనే పదానికి నాకు ఉన్న పాత ఆలోచనలకు భిన్నంగా, ఈ కాలానికి తగ్గ గురువుగారిగా అనిపించారు. తరువాత నాకు ఆయన తప్ప వేరే గురువుగారు అవసరం లేదు అనిపించింది. ఇంకా కొంతకాలం తరువాత ఈ జీవితానికి ఆయన చాలు అనిపించింది. అంటే అన్ని విధాలుగా నాకు జాబ్ ఇప్పించడం, పెళ్లి చేయడం, ........ఇలా అన్నింటా ఆయన అనుగ్రహం.





నా పెళ్లి అనుభవాన్ని నేను మీతో పంచుకుంటాను. నేను మొదటినుంచి మా బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకునేవాడిని. అదేవిధంగా తనకు కూడా ఇష్టం ఉండేది. ఉద్యోగంలో చేరిన తరువాత ఇక పెళ్లి చేసుకోవాలి అనుకున్నాను. ఒకరోజు మా స్నేహితుడు ఫోన్ చేసి ఆ అమ్మాయి ఎంగేజ్‌మెంట్ అయిపోయింది అని చెప్పాడు. ఆశ్చర్యపోవడం నా వంతయింది. ఆ తరువాత నేను కౌసల్యను పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కౌసల్యే గుర్తుకు రావడానికి కారణం నేను, వాళ్ల అన్నయ్య మంచి స్నేహితులం. ఒక రోజు నేను తెల్లవారుఝామున గం॥3.30ని॥కి ఆరతి కోసం ఎదురుచూస్తున్న కౌసల్యని చూసి, చేసుకుంటే ఇట్లాంటి అమ్మాయిని చేసుకోవాలనుకున్నాను. ఆ విషయం గురువుగారికి తెలియపరచడం, వారి అనుమతి తీసుకోవడం , పెళ్లి అవ్వడం అన్నీ జరిగాయి. ఈ సందర్భంలో ఒక విషయం చెప్పడం అసందర్భం కాదేమో. నాకు పెళ్లి చేసుకునే విధానం, ఆ తంతు అంతా అసలు ఇష్టం ఉండేది కాదు. నా మనసుకు నచ్చిన విధంగా నా పెళ్లి జరిగింది. సాయినామమే సర్వంగా, సద్గురు సన్నిధానమే రక్షగా నేను కౌసల్యకి తాళి కట్టడం జరిగింది. ఆ తరువాత నుంచి అర్థం అయ్యింది. మనం కోరుకునేదానికి, బాబా ఇచ్చేదానికి ఎంతతేడా ఉంటుందో. నా భాషలో చెప్పాలంటే నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా! నా భావాలకు అనుగుణమైన జీవిత భాగస్వామిని గురుదేవులు నాకు ప్రసాదించారు. నేను ఏదైనా విషయంలో డీలాగా ఉంటే తను బాబా మనకు ఉన్నారు అని గుర్తు చేస్తుంది. ఇలా ముందు సందర్భంలో జరిగి ఉండేది కాదేమో! మా ఇద్దరినీ బాబా గురువుగారు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. మేము ఇద్దరము బాబా మాటలలో చెప్పాలంటే తండ్రికి తగ్గ బిడ్డలుగా తయారవ్వాలనుకుంటున్నాము. దాని కొరకు గురువుగారిని ప్రార్థిస్తున్నాము. **– రామకృష్ణ,** చెన్నై

* * *

పూజ్య గురుదేవులు సద్గురు శ్రీ సాయినాధుని శరత్‌బాబూజీ గారికి సాష్టాంగ పాద నమస్కారములు తెలుపుకుంటూ , వారిచ్చిన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. నాపేరు అనిల్. నేను హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఇది నాకు కొన్ని రోజుల క్రితం అరుణాచలంలో జరిగిన అనుభవం. ఒకసారి నేను తిరువణ్ణామలైకి వెళ్లినపుడు ఒక స్నేహితుడికి ఫోన్ చేయాల్సిన అవసరం ఏర్పడి దగ్గరలో ఉన్న టెలిఫోన్ బూత్‌కి వెళ్లాను. చూస్తే నా మొబైల్‌లో, అతని నెంబరు లేదు. ప్రక్కనే ఉన్న శేఖర్‌ని అడిగితే తన మొబైల్‌లో ఆ నెంబరు ఉంది. చూసుకోమని తన మొబైల్ ఇస్తే ఆ నెంబరు తీసుకొని తిరిగి తనకి ఇచ్చేసాను. తరువాత మేమందరం కలిసి పూండీకి బయలుదేరాము. మేము పూండీ బస్సు ఎక్కుతుండగా ఎందుకో శేఖర్ తన





మొబైల్‌కోసం చూసుకున్నాడు. చూస్తే మొబైల్ లేదు. ఏమయిందో తెలియలేదు. నేను, "శేఖర్ నీ మొబైల్ ఎస్టీడీ షాపులోనే ఇచ్చేసాను కదా! ఎప్పుడు, ఎక్కడ మిస్ అయింది" అన్నాను. ఇందులో నా ప్రమేయం కూడా ఉంది అని అనుకొని తనకు క్రొత్త మొబైల్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. శేఖర్‌కి కొంచెంసేపు క్లాస్ తీసుకున్నాను. అంత అజాగ్రత్త ఏంటి? మొబైల్ కూడా మిస్ అయినదాకా తెలుసుకోకుండా ఉన్నావా? అని కొంచెం ఎక్కువగానే అరిచాను. తరువాత మాకు ఒక ఆలోచన వచ్చి, శేఖర్ మొబైల్‌కి కాల్ చేసాము. అప్పుడు విజయవాడ కేశవరావు అంకుల్ ఆన్సర్ చేసారు. మాకు ఏమీ అర్థం కాలేదు. "అంకుల్ ఎక్కడ ఉన్నారు" అని అడిగితే, "నేను ఆటోలో తిరువణ్ణామలై బస్టాప్‌కి వస్తున్నాను, వచ్చి మాట్లాడతాను" అని పెట్టేసారు. అంకుల్ వచ్చిన తరువాత విషయం తెలిసింది ఏమిటంటే మేము ఏ ఆటోలో అయితే బస్టాప్‌కి వచ్చామో, తిరిగి అదే ఆటోలో అంకుల్ వాళ్లు కూడా వచ్చారు. మేము శేఖర్ మొబైల్ కి ఫోన్ చేసినపుడు అప్పుడే ఆటోలో ఎక్కబోతున్న అంకుల్‌కి ఎందుకో అనుమానం వచ్చి రింగ్ అవుతున్న ఫోన్ (సీటులో ఉన్న) ఎపి నెంబర్ అని, ఆ డ్రైవర్ తనదంటున్నా వినకుండా అంకుల్ ఆన్సర్ చేయడం, అది మాది అని కన్‌ఫర్మ్ చేసుకొని, ఆ ఆటో డ్రైవర్‌కి చెప్పి, ఆ మొబైల్‌ని అంకుల్ తీసుకొచ్చి మాకివ్వడం జరిగింది. తరువాత నేను అరుణాచలం నుండి విజయవాడకు బస్‌లో వెళుతుండగా, బస్ డ్రైవర్ నా స్టాప్ దగ్గర ఆపలేదు. డ్రైవర్‌తో గొడవ పెట్టుకున్నాను. తను దగ్గరనే ఇంకొక స్టాప్ ఉంది, అది మీకు ఇంకా దగ్గరగా ఉంటుంది అంటూ డ్రైవర్ తను అనుకున్న స్టాప్ దగ్గరే ఆపాడు. నేను దిగబోతూ మొబైల్ చూసుకుంటే లేదు. మిస్ అయ్యింది. ఎక్కడ ఉందో వెతకగా నేను కూర్చున్న సీటు క్రింద పడి ఉంది. అదే నేను అనుకున్న స్టాప్ దగ్గర దిగితే నా మొబైల్ మిస్ అయ్యేది. నేను శేఖర్‌ని అన్న మాటలు గుర్తొచ్చాయి. ఆ క్షణం నా మనసులో గట్టిగా ఏర్పడింది. పరనింద చేయడం ఎంత తప్పో అని. ఆ రోజు నుండి ఎవరినీ నిందించకూడదు అనేది పాటించడానికి ప్రయత్నం చేస్తున్నాను.

ఎక్కడైనా బిడ్డలు తప్పు చేస్తే సక్రమ మార్గంలో పెట్టడానికి సామదాన దండోపాయాలను ఉపయోగించే తండ్రులను చూసాం. కాని ఈ తండ్రి పద్ధతి వేరు. మనం తప్పు చేసినపుడు మనలో పరివర్తన తీసుకురావడానికి ఆయన అనుసరించే ప్రేమ మార్గానికి ఎలాంటి వారైనా లొంగక తప్పదు. ప్రేమతో కూడిన ఆయన మాటను శిరసావహించక తప్పదు. ఏ క్షణమైనా ఏ విషయంలో అయినా, సమస్య కాని, బాధ కాని వచ్చినపుడు, ఆ బాధను, సంతోషాన్ని పంచుకోవాలనిపించినపుడు మొదటగా పంచుకునేది ఈ



ప్రేమాత్మునితోనే. నా జీవితంలో అనుక్షణం నీ వెంట నేనున్నాను అని నన్ను ఎఱుకలో ఉంచాలని గురుదేవులను ప్రార్థిస్తున్నాను. నన్ను బిడ్డగా స్వీకరించి, నాకు తల్లి, తండ్రి, గురువు, దైవం, సర్వం అయిన ఆయనకు తగ్గ బిడ్డలుగా ఉండాలని, ఆ తండ్రి బాటనే నడవాలని ఆ సమర్ధ సద్గురు సాయినాధుని ప్రార్థిస్తూ...

– **అనిల్,** హైదరాబాద్.

* * *

నా పేరు సంధ్య. మాది సంతనూతలపాడు. నాకు మొదట బాబు పుట్టాడు. బాబుకి సాయిసుత అని గురువుగారు పేరు పెట్టారు. రెండవసారి ప్రెగ్నెన్సీ వచ్చినపుడు నరేంద్ర అన్నతో చెప్పి, గురువుగారి నుండి ఆశీర్వచనాలు తీసుకుందామని అన్నతో ఫోన్‌లో మాట్లాడదామని ప్రయత్నిస్తున్నాను. నేను చేసినపుడు అన్న ఫోన్ తీయడంలేదు. నాకు అమ్మాయి అంటే చాలా ఇష్టం. నాకు 6వ నెల వచ్చినపుడు అమ్మగారు ఒంగోలుకు వచ్చారు, అమ్మగారితో చెప్పాను "అమ్మా! నాకు అమ్మాయి పుట్టాలని ఆశగా ఉంది, గురుదేవులకు తెలియచేయండి". అప్పుడు అమ్మగారు "నీకు గురువుగారు అమ్మాయినే ఇస్తారులే!" అని అన్నారు. ఎంతో సంతోషపడ్డాను. కాని మా ఇంట్లోవాళ్లు మావారి జాతకంలో అందరూ అబ్బాయిలు అని ఉన్నదన్నారు. నాకు అది విన్నాక అమ్మో! మళ్లీ అబ్బాయి అంటే నాకు ఇష్టం లేదు. కాని అమ్మ అలా అన్నాక నాకు సంతోషంగా ఉన్నది. ఇంట్లోవాళ్లు నీకు అబ్బాయి పుడతాడు అన్నపుడు నాకు బాబా, గురువుగారు ఉన్నారు. వాళ్లను నేను అమ్మాయి కావాలని అడిగాను, నాకు అమ్మాయే పుడుతుంది అని చెప్పారు. కాని అన్నకు ఫోన్ కలవడం లేదని బాధపడుతూ ఉండేదాన్ని. అలా 10వ నెల వచ్చి 10 రోజులు గడిచిపోయింది. డాక్టర్‌గారు ఇచ్చిన డెలివరీడేట్ దాటి 10 రోజులు అయ్యింది. నొప్పులు రావడం లేదు. పొట్టబరువు అయ్యి చాలా ఇబ్బంది కలుగుతుంది. మొయ్యలేక ఏడ్చేదాన్ని. నేను మొయ్యలేను నావల్లకాదు అని. ఇక నేను కనలేనేమో అని ఏడుస్తూ ఉండేదాన్ని. మా బావగారు వాళ్లు పాలు పొంగిస్తుంటే నేను అక్కడకు వెళ్లాను. ఆ రాత్రి మా అమ్మ వాళ్ల ఇంటికి వెళదాం అనుకుంటూ, మా మరిది ఫోన్‌తో నరేంద్రన్నకు ఒకసారి ఫోన్ చేసాను. వెంటనే కలిసింది. అన్న మాట్లాడారు. "అన్నా! డాక్టర్ ఇచ్చిన డెలివరీడేట్ ప్రకారం నాకు 10వ నెల వచ్చి 10 రోజులు అయ్యింది. నొప్పులు రావడం లేదు. డాక్టర్‌ని అడిగితే కొంత సమయం వేచిచూద్దామన్నారు. చాలా కష్టంగా ఉంది. గురువుగారికి చెప్పండి" అని చెప్పాను. అన్న "చెపుతాను" అన్నారు. ఫోన్ పెట్టేసిన



వెంటనే నొప్పులు రావడం మొదలు పెట్టాయి. మా అమ్మ వేడి నొప్పులు అయి ఉంటాయి. ఇంటికి వెళదాం అంది. కొంచెం కొంచెం నొప్పులు ఎక్కువ అవుతున్నాయి. మా వారికి ఫోన్ చేసాను. నొప్పులు మొదలైనట్లున్నాయి అని. తను నరేంద్రన్నకు ఫోన్ చేసి సంధ్యకు నొప్పులు వస్తున్నాయి అని గురువుగారి ఆశీర్వచనాలు కావాలని అడిగారు. వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాము. అరగంటలో డెలివరీ అయ్యింది. డాక్టర్‌గారు అమ్మాయి అని చెప్పారు. అప్పటివరకు అమ్మాయో, అబ్బాయో అని టెన్షన్. బాబాను తలచుకుంటూ ఉన్నాను. అమ్మాయని చెప్పగానే చాలా సంతోషంతో ముందు బాబాకు, గురువుగారికి నా కృతజ్ఞతలు చెప్పుకున్నాను. వెంటనే అన్నకు ఫోన్ చేసాము, కలవలేదు. అందరూ శిరిడీలో ఉన్నారు. వేరే గురుబంధువుకు ఫోన్ చేసి అమ్మాయి పుట్టిందని అన్నతో చెప్పి గురువుగారితో చెప్పమని అన్నాము. మాకు తరువాత తెలిసింది ఏమంటే నాకు నొప్పులు రాకపోవడం మొదలుకొని, డెలివరీ అయ్యే వరకు గురువుగారితో చెప్పమని నరేంద్రన్నకు మూడుసార్లు ఫోన్ చేసాను. శిరిడీలో గురువుగారు పాదదర్శనము ఇస్తున్న సమయం కనుక ఆ విషయాలు గురువుగారితో అప్పటి వరకు చెప్పడానికి వీలుకాక చెప్పలేదట. అలా డెలివరీ డేట్ దాటి 10 రోజులు అయినా డెలివరీ కాకపోవడం, గురువుగారికి చెప్పమని అన్నకు ఫోన్ చేయడంతోనే నొప్పులు రావడం, ఒక గంటలోనే ఈజీ డెలివరీ కావడం నాకు గురువుగారు ఇచ్చిన మంచి అనుభవం. మనలోని కోరికలను మనం ఆయన వద్దకు వెళ్లి చెప్పుకోవాలని అనిపించినా ఆయన వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉన్నపుడు మనం పూర్తిగా ఆయనపై ఆధారపడితే ఆయన మన మనసులో కోరికను తీరుస్తారని నాకు తెలిసివచ్చిన అనుభవం. మా పాపకు గురువుగారు సాయివసన అని పేరు పెట్టారు.

–**ఎస్. సంధ్య,** సంతనూతలపాడు.

**సాయి సమగ్ర దర్శిని : www.saibaba.com**

**గురుతత్వ దర్శిని : www.guruji.org**

**గురుబంధువులు అనుభవాలను పంపవలసిన చిరునామా:**

**gurukrupa@saimail.com**



**తరతరాలకు, జన్మజన్మలకు నా బిడ్డల సంరక్షణ బాధ్యత నేనే వహిస్తాను.**



'అడగటం నేర్చుకో' అన్న సాయిబాబా మాటలను అక్షరాలా పాటించడం ఎంత తేలికో.... అంతే కష్టం. అవధులు లేని సాయి అనుగ్రహం ఎల్లవేళలా మనపై వర్షిస్తూ ఉంటే మన మనసు వేరే ఆలోచనల వైపుకు ఎందుకు పరుగుతీస్తుందో తెలియదు. దీనికి కారణం మనం సాయి అనుగ్రహ ఎరుకలో ఉండకపోవడమేమో అని అనిపిస్తుంది నాకు. ఇందుకు ఉదాహరణ నా జీవితంలో జరిగిన ఎన్నో అనుభవాలు... ఇవన్నీ సాయి (బాబూజీ) ఆశీస్సుల సుమమాలలు... అందుండి ఒక అనుభవాన్ని మీతో పంచుకునే భాగ్యం నాకు గురుకృప కలిగించింది.

నా పేరు మురళీధర్. మాది వెంకటగిరి మండలం. నెల్లూరు జిల్లా. నేను నా చిన్నప్పటి నుంచి బాబా ( మా ఊరిలోని) మందిరానికి రెగ్యులర్‌గా వెళ్లేవాడిని. బాబా అంటే నాకు చిన్నప్పటి నుంచి తెలియని ఇష్టం. అంతకంటే ఆయన ఫొటో చూస్తే ఏదో మనకు దగ్గరి సంబంధం ఉన్న వారిలా అనిపించేది మనస్సుకు. అయితే నా 18వ సంవత్సరం అంటే నేను ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం చదువుతున్నపుడు మొట్టమొదటిసారిగా గురువుగారిని(చిత్రపటాన్ని) 'శ్రీసద్గురు సాయినాధుని శరత్‌బాబూజీ ఆశ్రమం' వెంకటగిరిలో దర్శించుకున్నాను. ఈ భాగ్యం నాకు ఒక గురుబంధువు వల్ల కలిగింది. అప్పటి నుండి గురువుగారి ఆశ్రమానికి రెగ్యులర్‌గా రావడం, అక్కడి పనులు, సత్సంగాలలో పాల్గొనడం నా దినవారీ జీవితంలో భాగం అయిపోయాయి. అప్పటి నుండి ఏ కష్టం వచ్చినా, గురువుగారికి చెప్పుకున్న వెంటనే ఊరట లభించేది. అది ఏ విషయంలోనైనా సరే... నా చదువు మొదలు, ఉద్యోగం, పెళ్లి, ఆఖరుకు నా బిడ్డ కూడా ఆయన అనుగ్రహం వల్లే కలిగాడు. అలా ఆయన తన భక్తుని కంటికి రెప్పలా ఎలా కాపాడుతుంటారో అన్నదానికి నా జీవితం ఒక ఉదాహరణ. ఇంకా చెప్పాలంటే మా మేనేజ్‌మెంట్ టెక్నాలజీలో **మాకు ఏ పనిచేయడానికైనా కాన్ఫిడెన్స్ గురువుగారే!** ఇక నా అనుభవానికి వస్తే నేను వాస్క్యులర్ కాన్సెప్ట్స్ అనే కంపెనీలో కోస్టల్ ఆంధ్రప్రదేశ్‌కు ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాను. కంపెనీ మీటింగ్‌లో పాల్గొనడానికి నేను దుబాయ్ వెళ్లవలసి వచ్చింది. నా దగ్గర పాస్‌పోర్ట్ లేదు. కేవలం 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది, దుబాయ్ వెళ్లడానికి. కాని గురువుగారి దయవల్ల పాస్‌పోర్ట్ అనుకున్న సమయంలోనే వచ్చింది. దుబాయ్ వెళ్లడానికి బెంగుళూరు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాను. అక్కడ బోర్డింగ్ పాస్ తీసుకునే ముందు లగేజీ పాస్‌లు ఇస్తారు. అందులో నాకున్న రెండు బ్యాగులకు బోర్డింగ్ టేప్స్ వేసి నాకు వాటి ట్యాగ్‌లను ఇచ్చారు. అవి తీసుకొని ఫ్లైట్‌లో కూర్చుని దుబాయ్ చేరాను. అక్కడ లగేజ్ కలెక్షన్ ర్యాంప్‌లో నాది ఒక బ్యాగ్



**అడిగింది ఇచ్చుటే సాయి శపథం**
**అడగటం నేర్పుటే బాబా పథం**



మాత్రమే వచ్చింది. రెండవ బ్యాగ్ కోసం దాదాపు 30 నుండి 40 నిమిషాలు వేచి చూసాను. కాని రాలేదు. అయితే మా మేనేజరు ఎయిర్‌పోర్టులో కంప్లైంట్ ఇచ్చి వెళదాము, ఇంక టైమ్ అయిపోతుంది, అందరూ వెయిట్ చేస్తున్నారు అని అన్నారు. సరే అని అక్కడ కంప్లైంట్ డెస్క్‌లో బ్యాగ్ గురించి వివరాలు ఇచ్చి, బ్యాగ్‌కు సంబంధించిన రిఫరెన్స్ ట్యాగ్ వివరాలు ఇచ్చి, నేను ఉండే హోటల్ అడ్రస్ మరియు ఫోన్ నెంబరు ఇచ్చి వచ్చాను. వాళ్లు సాధ్యమైనంత వరకు మీ బ్యాగ్ మీకు అందేలా చూస్తాము అని చెప్పారు.

సరే అని హోటల్ రూమ్‌కి వచ్చి, నేను నాతో తెచ్చుకున్న గురువుగారి ఫోటోని బాగా కనిపించే విధంగా నా టేబుల్‌పై పెట్టుకుని, ఊదీ ఉంచాను. మొదటిరోజు ఎలాగో నా సహచరుని షూస్ వేసుకొని మీటింగ్‌కు వెళ్లాను. నా మిస్ అయిన బ్యాగ్‌లో అన్ని ముఖ్యమైన డాక్యుమెంట్స్, బట్టలు మరియు డైరీ ఉండిపోయాయి. ఒకరోజు గడిచింది కాని బ్యాగ్ అందలేదు. నేను మరలా ఒకసారి ఎయిర్‌పోర్ట్ ఆఫీసుకు ఫోన్ చేసి, మాట్లాడినా, వాళ్లు నిక్కచ్చిగా "మీ బ్యాగ్ ఇంకా దొరకలేదు, దొరికిన వెంటనే మీకు ఫోన్ చేస్తాము అని అన్నారు. ఒకవేళ దొరకకపోతే అది మా బాధ్యత కాదు" అని కూడా చెప్పారు. ఇక నాకు భయం మొదలైంది. నాకు ఒక్కటే మార్గమనిపించింది. అది గురువుగారిని వేడుకోవడం. వెంటనే గురువుగారి ఫోటోను చేతిలోకి తీసుకొని గురువుగారు నాకు ఎలాగైనా బ్యాగ్ దొరికేలా చేయండి అని ఆయన పాదాలకు నమస్కారం చేసుకొని పడుకున్నాను. అప్పటిదాకా నేను గురువుగారికి ఈ విషయం చెప్పుకోలేదు, అన్న ఆలోచన రాలేదు. అలా గురువుగారికి చెప్పుకొని ఆ రాత్రి పడుకున్నాను. ఇంచుమించు అది ఉదయం 6 గంటలు అయి ఉంటుంది. రూం బెల్ మ్రోగుతోంది. వెళ్లి తలుపు తీసేసరికి ఎదురుగా నా బ్యాగ్ పట్టుకొని బాయ్ నిలబడి ఉన్నాడు. నాకు ఆశ్చర్యం, ఆనందం వేసింది. వెంటనే ఇక గురువుగారి ఫోటో వద్దకు వెళ్లి మరలా ఆయన పాదాలను పట్టుకొని గట్టిగా ఏడ్చేసాను. అంతకు ముందు రాత్రి ఫోన్ చేసినపుడు దొరకని బ్యాగ్, అంతలోగా దొరికి ఉదయానికల్లా నా దగ్గరకు చేరిందంటే ఇది సద్గురు అనుగ్రహం కాక మరేమిటి? అనుక్షణం ఆయన ఎరుకలో వున్నాననే (అహంకారం) మరపు కాబోలు అడగడాన్ని మరిపింపచేసింది, అని అనిపించింది ఆ క్షణంలో నాకు అంతరాలు లేని ఆ కరుణామూర్తిని నోరు తెరచి, మనస్ఫూర్తిగా వేడుకొంటే, కాని పని, తీరని లోటు ఉంటుందా మరి... అందుకే గురువుగారు మొదట 'అడగటం నేర్చుకోండిరా' అని అంటారు...

–**మురళీధర్**, విజయవాడ





# రసస్పందన

సద్గురు చరణ దాసులారా! ఈ పృథ్విలోని అణువణువు జల్లెడపట్టి వెదకినా, ఎన్ని వేద వేదాంగముల శ్రవణము చేసినా, ఎన్నో పురాణేతిహాసముల మననము గావించినా, ఎంత వారనైతేఏమి, ఎవ్వరయితేనేమి – సద్గురు చరణ సన్నిధి వినా చిత్త శాంతినందించు స్థానము లేదు కదా! సద్గురు దర్శనము వినా పరమానందము నందించు మోము చూడలేము కదా! అట్టి సుమధుర లీలా వినోద మననము, స్మరణము అందించు మహాత్ముల చరితలు – నిత్య స్మరణీయాలు – సదా ఆచరణీయాలు. 'రసస్పందన' శీర్షికకు లక్ష్యం ఒక్కటే. **ప్రతీ మాటలోనూ, బాటలోను, అనుభూతిలోను, ఆచరణలోనూ సద్గురు స్మరణ, మనన, చింతనము – ఇంతకు మించి వాంఛితమేమీ లేదు**. ఇట్టి సత్సంకల్పానికి సద్గురు అనుగ్రహమే రక్ష!

మహాత్ముల చర్యలు అగాధాలు. వారి వ్యక్తిత్వాలు సత్యద్రష్టలు. వారి జీవితాలు మానవజాతి మనుగడకు ఆధారాలు, అమూల్యమైన జ్ఞాన భాండాగారాలు. వివేకానంద స్వామి ఒక చిత్రమైన వ్యక్తి. ఆయన మాట్లాడలేని అంశమంటూ లేదంటే అతిశయోక్తి కాదు. వాల్మీకి, భవభూతి, కాళిదాసు వంటి కవులనుంచి కళలు, చరిత్ర, సంగీతం... ఇత్యాదులెన్నో ఆయనకు కరతలామలకాలు. కానీ ఈ జ్ఞాన సముపార్జనంతా రామకృష్ణుల అనుగ్రహ విశేషమే కానీ మరేదీ కాదంటారు వివేకానందస్వామి. మానవ జీవిత పురోగమనానికి ఈ క్రింది సంఘటన ఒక చక్కటి భాష్యం. ఆగ్రా నుండి స్వామీజీ బృందావనం బయలుదేరారు. చివరి 30 మైళ్ల దూరం ఆయన కాలి నడకనే వెళ్లాల్సి వచ్చింది. బృందావనం ఇక రెండు మైళ్లు మాత్రమే ఉందనగా స్వామీజీని ఆకలి, అలసట, ఆవహించాయి. దారిలో ఒక వ్యక్తి కూర్చొని తాపీగా హుక్కాతో పొగ త్రాగతూ ఉండడం స్వామీజీ కంటపడింది. కాస్త పొగ పీలిస్తే ఉత్సాహం వస్తుందని స్వామీజీ అతడిని సమీపించి తమ ఆకాంక్షను తెలియచేశారు. అందుకు ఆ వ్యక్తి "అదెలా స్వామీ? నేను మరుగుదొడ్లు శుభ్రం చేసేవాణ్ణి. నా హుక్కా ఉపయోగించి మీరు పొగ త్రాగడమా?" అని అడిగాడు. "నిజమేకదా! ఇతగాడి హుక్కా ఉపయోగించి నేను పొగత్రాగడమా?" అనుకొని స్వామీజీ అక్కడినుండి కదలిపోసాగారు. అలా కాస్త దూరం వెళ్లగానే హఠాత్తుగా ఆయన మనస్సులో ఠక్కున ఈ ఆలోచన మెదిలింది. "ఏమిటి! నేనొక సన్యాసిని. కులతత్త్వం, కులప్రతిష్ఠ లాంటి వాటినన్నింటినీ త్యజించానని ప్రతిజ్ఞ చేశాను కదా! ఒక్కక్షణంలో ఇలా నన్ను నేను మరచిపోయానే!" అనుకొని వెంటనే వెనుకకు తిరిగి వచ్చి "సోదరా! పొగ సిద్ధం చేయి" అన్నారు. ఇప్పుడు స్వామీజీలో ఎట్టి సంశయము, సందిగ్ధము లేదు. ఒక్క విషయం – **తప్పు చేయడమో, పొరబడడమో నేరం కాదు. తప్పు అని తెలుసుకొని దానిని సరిదిద్దుకోవడమే**





**పురోగమన మార్గం. జీవితంలో ఎదురయ్యే పరిస్థితులనన్నింటినీ మనం సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యమే. గుణపాఠం నేర్చుకోవాలి. వాటన్నింటి నుండి గుణపాఠం నేర్చుకోవడం సాధ్యమే. గుణపాఠం నేర్చుకోవాలి. అప్పుడే జీవితంలో పురోగమించి లక్ష్యం సాధించ గలుగుతాం.**

గురుశిష్య బాంధవ్యానికి చక్కటి భాష్యం ఈ సంఘటనల సమాహారం. బృందావనం నుంచి హరిద్వార్ బయలుదేరిన వివేకానంద స్వామికి హెూత్రస్ రైలు నిలయంలో తారసపడ్డ సహాయ స్టేషన్‌మాస్టర్ శరత్‌చంద్ర, తొలి చూపులోనే స్వామిని ప్రేమించి, కడదాకా స్వామిని అంటిపెట్టుకున్న ప్రథమ వివేకానంద శిష్యులు. స్వామి చెప్పినపని చెప్పినట్లు చేసి స్వామి అనుగ్రహాన్ని అపారంగా అనుభవించిన ధన్యజీవి. శరత్ స్థిరత్వాన్ని గమనించడానికి ఎన్నో రకాలుగా స్వామి పరీక్షించినప్పటికి తన మొక్కవోని శ్రద్ధతో స్వామిని ప్రసన్నం చేసుకున్నాడు శరశ్చంద్ర. ఇది ఒక పార్శ్వం. ఇక మూర్తీభవించిన ప్రేమకు రూపం వివేకానంద స్వామి. ఉద్యోగానికి తిలోదకాలిచ్చి వివేకానందస్వామి వెంట బయలుదేరిన శరత్ సన్యాస జీవితంలోని ప్రతీ కష్టంలోను తనకు బాసటయినారు వివేకానందస్వామి. ఒక పర్యాయం హిమాలయాల్లో కాలినడకన సాగే సమయంలో స్పృహ తప్పిన శరశ్చంద్రను మోసుకెళ్లారు స్వామి. అంతేకాదు, అస్వస్థతగా ఉన్న సమయంలో సంచీ, కట్టుబట్టలు, ఇంకా చెప్పాలంటే శరత్ పాదరక్షలను సైతం మోశారు ఆయన. కాలాంతరంలో శరత్ మనసు చంచలమవగా శరత్, "స్వామీజీ, నన్ను వదిలి పెట్టేస్తారా!" అని అడుగుతాడు. "మూర్ఖుడా! నీ చెప్పులు కూడా నేను మోశానని మరచిపోయావా?" అంటూ అతణ్ణి సుతిమెత్తగా చీవాట్లు పెట్టారు. శరశ్చంద్రకు సన్యాసదీక్ష నొసగిన సందర్భంలో ఇలా అడిగారు శరత్ – " స్వామీజీ! బహుశా నేను సన్యాస ధర్మం నుంచి జారితే?".. అని ప్రశ్నించారు. "నూరుసార్లు జారినప్పటికి పరవాలేదు! బాధ్యతనాది. నేను నిన్ను ఎంపిక చేశాను. నువ్వు నన్ను ఎంపిక చేయలేదు." అంటూ స్వామీజీ తన ప్రేమను వెల్లడి చేశారు. శరశ్చంద్రకు స్వామి పట్ల ఉన్న ప్రేమను ఈ క్రింది సంఘటనతో గమనించడం అప్రస్తుతం కాదు. ఒకరోజు స్వామి తమ శిష్యులతో "నాకన్నా ఉన్నతుడైన వ్యక్తి తారసపడితే నన్ను వదిలివేస్తారా" అని అడిగారు. భిన్న మైన సమాధానాలు వచ్చాయి. "వదలం", "ఎన్నటికీ వదలం" ... ఇలా చివరగా శరశ్చంద్రను అడిగారు. అందుకు "అవును వదిలివేస్తాను" అన్నారు శరశ్చంద్ర. విస్తుపోయారు అందరూ. క్షణం సేపు మౌనంగా ఉండి ఇలా కొనసాగించారు "మీకన్నా ఉన్నతుడైన ఒక వ్యక్తి తారసపడితే ఖచ్చితంగా నేను మిమ్మల్ని వదిలిపెట్టి తీరాలి. ఎందుకంటే మీకన్నా ఉన్నతుడైన వ్యక్తి ఒకరు ఉన్నారనుకోవడమే మిమ్మల్ని వదిలివేయడానికి





సమానం కదా!" చివరకు భావనలో కూడా గురువుకన్నా అన్యాన్ని గొప్పగా ఊహించడం ఎంత పొరపాటో మనకు శరశ్చంద్ర చేసే చక్కటి జీవన విధానం. సామాన్య మానవుడు కర్మలననుసరించవలసిన తీరు గురించి వివేకానంద స్వామి చెప్పే కర్మయోగం గమనిస్తే "పనులు విడిచి పెట్ట నక్కరలేదు. అన్ని పనులూ చేయవచ్చు. పని చేయడమంటే? లక్ష్యాన్ని, సాధననూ ఏకం చేయి. మీరు ఏ పని చేసినా ఆ పని తప్ప మరేదీ యెచించకండి. ఆ పనిని ఒక ఆరాధనగా, ఉన్నతమైన ఆరాధనగా, ఆ సమయంలో మీ జీవితం యావత్తూ దానికి అంకితం చేసి చేయండి. అలా చేసేటపుడు అది ఆధ్యాత్మిక పురోగతికి దారితీస్తుంది." సంకుచితమైన ఆచార వ్యవహారాలు, మూఢ సంప్రదాయాలకు వివేకానందుని సమాధానం – "హిందూ మత భావనలను విశ్లేషించి చూడాలి. సంశోధించి చూడాలి. విద్యావంతుడైన ప్రతీ హైందవుని కర్తవ్యమది. ఇందుకు ముందు మన సంకుచిత అభిప్రాయాల నుండి బయటపడాలి. వర్తమాన కాలం అమిత వేగంతో ప్రగతిపథంలో వెళుతూ ఉండడం చూడాలి. మన ఆచార సంప్రదాయాలు ఏవైనప్పటికి అవి మన సాంఘిక జీవనానికో, తాత్త్విక వైఖరికో ఆటంకంగా మారే పక్షంలో వాటిని తుంగలో తొక్కి ముందుకు సాగాలి." విశ్లేషించి చూస్తే సద్గురు వాణి మన జీవితాల్లోని ఎన్నో పార్శ్వాలను స్పృశిస్తుంది. వివేకానంద స్వామి యొక్క బోధను, వాణిని పాశ్చాత్య రంగంలో గమనించాలంటే మధురమైన ఆ చరిత్రను ప్రతి మానవుడు అవధరించి తరించవలసిందే. పరనింద విషయానికొస్తే ఇదీ వివేకానందుని మార్గం. ఎవరి అపరాధాలనూ ఆయన పెద్దవి చేయరు. ఎవరి సద్గుణాలను చిన్నవిగా చూడరు. ఇతరుల అణువంత మంచిని పర్వతంలా గాంచారు. పర్వతమంత అపరాధాలను అణువుగా చూశారు. ఇంతటి సంబంధం కారణంగానే ఆయన మాట్లాడిన, చింతన చేసిన, ప్రయత్నించిన, సాధించిన ప్రతీ ఒక్కటీ అర్థం చేసుకోబడ్డాయి. అర్థం కాకపోయినా, ఆయన ఉద్వేగమూ, శక్తీ ప్రతి ఒక్కరికి ప్రేరణగానే పరిణమించాయి. మనిషి ఆత్మలో, దాని అనంత శక్తిలో ఆయనకు అనంత నమ్మకం. ఆ శక్తినే ఆయన ఇతరులలో రగిలించారు. అదే స్వామీజీ విధానం.

పావన గంగానదీ తీరం. గలగలా పారే గంగమ్మ పరవళ్లు, కలకత్తా నగర జనజీవనపు ఉరుకులు, పరుగుల మధ్య ఒక ప్రశాంతమైన సన్నిధి, మనసుకు ఏదో ఒక తెలియని అవ్యక్తపు అనుభూతిని అందించే భక్తి సుగంధాలు, శ్రీరామకృష్ణ, శారదామాత, వివేకానందస్వామి సమాధి స్థానాలు. రామకృష్ణుల అనుంగు పుత్రుడు, గురుభక్తి పరాయణుడు, సద్గురుమార్గంలో మనకు ఒక చక్కటి జ్ఞానదాయి అయిన శ్రీ వివేకానంద స్వామి వారి చేతుల మీదుగా శ్రీ రామకృష్ణుల అస్థికలు ప్రతిష్టించి, స్వామి విజ్ఞానానంద కృషితో ఒక





మహోన్నత కట్టడం రూపుదాల్చింది. ఈ కట్టడానికి సంబంధించిన విశేషాలను పరికిస్తే – శ్రీ రామకృష్ణులు ఒకానొక సందర్భంలో వివేకానంద స్వామితో అంటారు " నరేన్! నువ్వు నీ భుజాలమీద నన్నెత్తుకొని ఎక్కడికి తీసుకువెళితే అక్కడకు రావడానికి నేను సిద్ధంగా ఉన్నాను." ఆ వాక్కుకు సాక్షీభూతంగా శ్రీ వివేకానంద స్వామి సాక్షాత్తూ తన భుజాలపై మోసుకొొచ్చి వారి దివ్య అస్థికలు ప్రతిష్ఠించిన స్థలం ఈనాడు ఒక గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లుతోంది. అంతేకాదు, వివేకానందస్వామి ఆశయాలకు అనుగుణంగా ఈరోజు **"భారతజాతికి కావల్సింది ఏక మతం కాదు. మతైక్యం"** అంటూ విజ్ఞానానంద ఈ కట్టడంలో సర్వమతాలను మిళితం చేసారు. సాగిపోతున్న ఈ సద్గురు చరితకు ప్రకృతి విధించిన నియమం ఆసన్నమైంది. తన యావజ్జీవితాన్ని రామకృష్ణుల వాణిని వ్యాప్తి చేయడానికై, భారతజాతిని దాతృత్వ శృంఖలాలనుండి విడిపించడానికై శ్రమించిన, జాతి గర్వించదగిన మణి – వివేకానందుని చివరిరోజులు – కొన్ని బోధలు – "అనుభవ పూర్వకంగా సత్యాన్ని గ్రహించిన వ్యక్తి అనంత శక్తికి ఆలవాలమవుతాడు. అతని నుండి ఆధ్యాత్మిక తరంగాలు పొంగి పొరలుతుంటాయి. ఆ పరిధిలోకి వచ్చేవారు ఆ శక్తితో ఆకర్షితులవుతారు. ఈ విధంగా ఎక్కువగా ప్రయత్నించకుండానే వారు ఆతడి ఆధ్యాత్మిక శక్తి పర్యవసానాలను పొందుతారు. ఇదే సద్గురు అనుగ్రహం". స్వామికి విశ్రాంతిని చేకూర్చాలనే సంకల్పంతో ఎవరైనా స్వామిని కలవడానికి తిరస్కరింపబడితే "ఇదిగో చూడండి ఈ దేహం ఏం గొప్ప విషయం? ఇతరులకు సహాయ పడడంలో రాలిపోనీ! సత్యాన్ని గ్రహించాలనే తపనతో వచ్చేవారిని చూసి నేనెంత సంతోషిస్తానో! ఆ పని చేయడానికి పదే పదే జన్మించి, మరణింప సిద్ధంగా ఉన్నాను." 1902వ సం॥ ఏప్రిల్‌లో మెక్లౌడ్‌తో అన్న మాటలు –"ఈ లోకంలో నాకంటూ ఏదీ లేదు. దమ్మిడీ కూడా నా వద్ద లేదు. నాకు ఇచ్చినదంతా లెక్కకట్టి తిరిగి ఇచ్చేసాను".

1902 జూలై 1వ తేదీ, స్వామీజీ గంగా తీరంలో ప్రేమానందతో పచార్లు చేస్తున్నారు. ఉన్నట్లుండి ఒక స్థలాన్ని చూపించి "నేను దేహం త్యజించాక నన్ను అక్కడ దహనం చేయండని" ఆదేశించారు. జూలై 2వ తేదీ ప్రియ పుత్రిక (శిష్యురాలు) సిస్టర్ నివేదితకు భోజనంలో అన్నీ తానే వడ్డించి, తమాషాగా మాట్లాడి, ఆమె చేతులు కడుగుకోవడానికి నీళ్లు పోసి, ఆయనే తుడిచారు. "ఇవన్నీ నేను మీకు కదా చేయవలసింది" అన్న నివేదితతో "ఎందుకు! ఏసుక్రీస్తు తమ శిష్యుల కాళ్లను కడిగారు కదా!" అంటూ ధృడంగా చెప్పారు. "కానీ! అది.... ఆయన.... చివరిరోజు!" అనే మాటలు నివేదిత నోటి దాకా వచ్చి



**శ్రీ సాయి అవతార కార్యంలో ప్రధాన అంశమైన సర్వమత సమరస భావాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించనిదే మనం ఎన్నటికీ సాయిభక్తులమవలేము.**

ఆగిపోయాయి. జూలై 4వ తేదీ శుక్రవారం అన్ని రోజుల్లా ఆరోజూ ఉదయించింది. కానీ దాని గర్భంలో ఎంత శోకం దాగి ఉందో! ఉదయం 9.30 గం॥ల నుండి 11 గం॥ల వరకు తక్కిన రోజుల్లోలా కాక తలుపులు, కిటికీలు మూసి ఉన్న రామకృష్ణుల గదిలో స్వామి ధ్యానమగ్నులయ్యారు. అక్కడ ఏం జరిగిందో ఎవరికెరుక. "తాము నాకు అప్పగించిన పని పూర్తయ్యింది. తమ పాద పద్మాల వద్దకు చేరుకుంటానని" రామకృష్ణులకు విన్నవించారా? క్రిందకు వచ్చాక ప్రేమానందతో " ఈ వివేకానంద ఏం చేశాడో ఎవరికి తెలుసు? బహుశా మరో వివేకానంద ఉండి ఉంటే అతడు అర్థం చేసుకోగలడు. అయితే ఏం? కాలక్రమంలో ఎందరెందరో వివేకానందలు ఉద్భవించనున్నారు" అంటూ స్పృహే లేకుండా అన్నారు.


ఆ రోజంతా అందరినీ ఆనందంలో ముంచెత్తారు. తామే మఠంలోని బ్రహ్మచారుల గదులకు వెళ్లి వారిని పిలుచుకువచ్చి మరీ జ్ఞాన బోధ గావించారు. ధ్యానంలో అలవాటుకు మారుగా వాయువ్య ముఖంలో కూర్చొన్నారు. సాయంత్రం 6.30గం॥లకు శిష్యుణ్ణి పిలిచి గది వేడిగా ఉందని కిటికీ తలుపులు తెరిపించారు. తమ తలకు కాస్త విసరమని, కాసేపు విసిరిన తరువాత "చాలు, ఇక విసరనక్కరలేదు, నా కాళ్లు కాస్త వత్తు". అన్నారు. కొంతసేపటికి నిద్ర పట్టింది. ఎడమవైపుగా పడుకున్న స్వామి, ఒకసారి కుడివైపు తిరిగి పడుకున్నారు. హఠాత్తుగా ఆయన చేతులు ఒకసారి వణికాయి. కలగన్న పిల్లవాడు మెల్లని స్వరంలో ఏడ్చినట్లుగా స్వామీజీ నుంచి శబ్ధం వినవచ్చింది. కాసేపట్లో దీర్ఘంగా శ్వాసించారు. ఆయన తలగడ మీద తలవాలింది. మళ్లీ ఒకసారి అదే విధంగా దీర్ఘంగా శ్వాసించారు. తరువాత అంతా నిశ్శబ్ధం. సమయం దాదాపు 9 గం॥లు. వివేకానందస్వామి భౌతికంగా ఇక లేరు. కానీ..... "చిరిగిన వస్త్రాన్ని తీసి విసిరివేసినట్లు నా దేహాన్ని విసిరి వేయడం మంచిదని ఒక రోజు నాకు అనిపించవచ్చు. కాని నేను పని చేయడం ఆపను. లోకంలోని మనషులకు ప్రేరణనిస్తూనే ఉంటాను. వారందరూ తాము భగవంతునితో సమైక్యమైనట్లు గ్రహించేదాకా నేను శ్రమిస్తూనే ఉంటాను" అన్న వ్యక్తి నిష్క్రమిస్తారా? లేదు. సద్గురుపథంలోని ప్రతి వ్యక్తి గమనంలోను వివేకానందస్వామి ఒక ఆదర్శంగా నిలుస్తారు. - సందేహం లేదు.

'గురుకృప' పత్రిక చివరగా తన నిస్సహాయతను ఒప్పుకుంటోంది. అనంతమైన సద్గురుపథాన్ని, జేబు రుమాలులో కట్టడం అసాధ్యం. సద్గురు చరణ దాసులకు విన్నపమేమంటే ఇదొక చిరు ప్రయత్నం. సద్గురు పథంలో పయనించాలనుకునే వ్యక్తికి వివేకానంద వాణి చక్కటి మార్గం కాగలదు. అవధరించి, తరించండి.



*నీ ఆనందాన్ని ఇతరులతో పంచుకో.*
*అలా చేయడం వల్ల అది మరింత పెరుగుతుంది.*




సద్గురు చరణ సన్నిధి వినా చిత్త శాంతినందించు స్థానము లేదు కదా!
సద్గురు దర్శనము వినా పరమానందము నందించు మోము చూడలేము కదా!
అట్టి సుమధుర లీలా వినోద మననము, స్మరణము అందించు
మహాత్ముల చరితలు- నిత్య స్మరణీయాలు – సదా ఆచరణీయాలు.